# దీపాల నీడల్లో...!

దీపాలు వెలిగాయి. నగరమంతా దీపాల తోరణాలు కట్టుకుని దీపావళి పండుగకు నూతన శోభకూర్చి తులుకుతోంది. అక్కడక్కడ అడపా తడపా పేలడం ప్రారంభించిన టపాకాయలు-రోలు-రోకళ్లు, కప్పగంతులు-నగరంలో అన్ని ధ్వనులను ద్విగుణీకృతం చేస్తున్నాయి. వీథుల్లో నడుస్తున్న జనం దీపాల నీడలతో కదలిపోతున్నారు.

చీకటి పెరుగుతుంది. దీపాలు వెలుగుతున్నాయి. ప్రమిదల్లో-విద్యుత్స్తంభాలపై-గాలి రొజుకుంటూ విసురుతోంది. ఎగిరే టపాకాయల గర్వం అణుస్తోంది పడుతున్న జల్లు- ఆ కొద్దివాన రాత్రి చీకట్లను భేదించుకుంటూ, మెరుములు విసురుతూ ఆకాశంకూడా దీపావళి చేసుకుంటోంది.

పార్కు, కాలేజి. ఆస్పత్రి- ఒక త్రికోణాకారంలో ఒక చౌరస్తాలో నిలుచున్నాయి. పది గంటలు దాటింది- పార్కుకెదురుగా మేడలో మూడవ అంతస్థులో- తెరకట్టిన కిటికీ వెనుకనుంచి విద్యుత్కాంతి-ఆ కాంతిలో కదిలే మనుష్యుల నీడలు తెరమీద వాలుతూ, ఊహాచిత్రాలు అందిస్తున్నాయి.

ఇనుప ఊచల కంపౌండు ఏర్పరచుకున్న పార్కుప్రక్క రావిచెట్టు చినుకు గాలిలో విద్యుద్దీపం నీడలో రొజుతూ ఈల వేస్తోంది.

రాత్రి గడుస్తోంది-

రావిచెట్టుక్రింద గోనెసంచిలు కప్పుకుని కూర్చున్నారు రామి, భద్రయ్య.

కప్పగింత రాయిమీదగీసి భద్రయ్య ఒడిలో వేసింది రామి అల్లరిగా-భద్రయ్య కసిఎక్కిన అభిమానంతో రామి నెత్తిమీద కొట్టాడు-కిలకిల నవ్వింది రామి-గలగల నవ్వాడు భద్రయ్య.

ఎండు రావిఆకులు శబ్దం చేశాయి గలగల-బూట్ల అడుగునపడి ధ్వనిచేశాయి. సిగరెట్టు కాలుస్తూ సూటు వేసుకున్న మనిషి నడిచి పోతున్నాడు. పార్కు ఎదురు మేడ ఎక్కాడు. తలుపు తట్టాడు- నేను సత్యం- అని తలుపు తెరుచుకుంది.

రావిచెట్టుక్రింద రామి దగ్గరకు కుక్క వచ్చింది. దానిపై కప్పగంతు పేల్చింది రామి- కుక్క భోయ్‌మంది- మరి రెండు కుక్కలు దానిదగ్గరకు చేరాయి- చెలగాటాలు ప్రారంభించాయి.

వానజల్లు తగ్గింది. గాలి చల్లగా హాయిగా ఉంది. వీథుల్లో బాణసంచా తుక్కుకూడా ఎగిరి గంతేస్తోంది. ఆ రమణీయమైన వాయువుల్లో-

రెండంతస్థుల బస్సు అనంతమైన రొదచేసుకుంటూ పోయింది.

ఆసుపత్రి గోడల నీడల్లో ఒక బిచ్చగాడు తన బిచాణా పరచుకున్నాడు. అరిగి విరిగిన కాళ్ళు నిమురుకున్నాడు.

ఆకాశంలో క్రొత్త తారల్లా తారాజువ్వలు దూసుకు ప్రయాణిస్తున్నాయి.

రావిచెట్టుకు అనుదూరంలో ఒక రిక్షావాడు, రిక్షా ఆపి టాపుమూసి సోఫాలో ఒరిగినట్లు దానిలో ఒరిగి చుట్ట ముట్టించాడు. గెడ్డం పెరిగిన ఒక సాధువు ప్రశాంతంగా ఆకాశంవైపు చూసి, పంచభూతాలు స్మరించి పార్కులోదూరి కుళాయినీరు త్రాగి హరేరాం అంటూ పచ్చగడ్డి పార్కులో మేను వాల్చాడు-ఆకాశంలోని నక్షత్రాలు లెక్కపెట్టే పరిస్థితి క్లిష్టతరంకాగా-పార్కు ఎదురు మేడమీద కిటికీ తెరమీద రెండు నీడలు నిలుచున్నాయి. ఆడ-మగ-రత్నం, సత్యం.

'అయితే చివరకు చనిపోయాడన్నమాట'

'అవును'

'నాకు కబురైనా పంపలేదు'

'ఎవరిచేత పంపించేది'

'అవును'

'అయినా నువ్వు రాకమానవని నాకు తెలుసు'

రత్నం ముఖం దించుకుంది, మోకాళ్ళలోకి. ఏడ్చింది-ఆమె కన్నీరు ఆమె చీరను తడిపింది.

సత్యం చూశాడు దూరంగా చాపమీద రత్నం పిల్లలు యిద్దరూ- ఆరు, నాల్గేళ్ళవాళ్ళు- ఏమి తెలియని అమాయకత్వంలో నిద్రపోతున్నారు.

'పిల్లలు నిద్రపోయారు భోంచేసి- మందుత్రాగి ఆయన చనిపోయారు'

'ఎన్నింటికి ?'

'పది కొట్టింది'

రత్నం వెక్కి వెక్కి ఏడ్చింది- 'ఎవరు పిలుస్తే ఎవరు వస్తారు ?'

సత్యానికి తెలుసు ఎవరూ రారని.

భూతలింగం జీవితం ఒక సంకుల సమరం- మనిషే యుద్ధభూతంలా ఉంటాడు. తమ్ముళ్లను తరిమాడు- ఆస్తి కాజేశాడు- మొదటిభార్య చనిపోతే- పిల్లలను అనాథాశ్రమములో చేర్చి- రత్నాన్ని పెళ్ళాడాడు. అతనితల్లి కుటుంబానికి అతనంటే పరమ అసహ్యం- రత్నం పూర్తిగా ఒక అనాథ- ఆమెను పలకరించేవారు తక్కువ. భూతలింగం చనిపోయాడు. రత్నం నిజంగా మళ్ళీ ఒక అనాథ అయింది.

ఒకే గ్రామంలో సత్యం, రత్నం ఆడుకున్నారు-చదువుకున్నారు. రత్నం తల్లిదండ్రులు చనిపోతే ఆమె మామయ్య రత్నాన్ని చేరదీశాడు. కొన్నాళ్ళ తరువాత యింటిపోరు భరించలేక రత్నాన్ని అనాథాశ్రమంలో చేర్చాడు. అక్కడ రత్నం కొంత చదువుకొంది మళ్ళీ సత్యం ఆమెను స్కూల్లో చూశాడు. తరువాత హఠాత్తుగా విడిపోయారు యిద్దరూ.

సత్యం మారిపోయాడు జీవితంలో- నిలకడలేని నిమ్నోన్నతాలు బ్రతుకు- ఎదిరి కలుసుకునే ఏ వస్తువునూ వదలడు అందింది అనుభవిస్తాడు- అందనిదానికి సాహసం చేస్తాడు. జీవితంలో నియమాలు పిరికిపందలకు అంటాడు. అదే జీవితంలోని సత్యమంటాడు.

రత్నాన్ని నగరంలో ఒకనాడు బట్టల దుకాణంలో కలుసుకున్నాడు. ఆమె జీవిత పరిణామాలు తెలుసుకున్నాడు- ఇల్లు పట్టుకున్నాడు. మునుపటి స్నేహం మరువరాని సంఘటన లన్నాడు యౌవన ఉద్రేకంలో.

భూతలింగం యింట్లో లేనప్పుడు సత్యం ఎన్నోసార్లు వచ్చాడు రత్నాన్ని కలుసుకుందుకు- కలుసుకుని నిరాశగా వెళ్ళిపోయేవాడు.

ఈనాడు భూతలింగం యింట్లో ఉండగానే వచ్చాడు. కాని భూతలింగం శవం మంచంమీద పరుండగా వచ్చాడు సత్యం.

ఇద్దరిమధ్య నిశ్శబ్దంలో జరిగిన సంభాషణలు- మునుపటికిని కదల్చాయి- అతని మనస్సులో.

'రత్నం-నా జీవితం ఒక గాలిపటం- కాని నాకు నీవు తోకగావుంటే గాలిలో నేను బాగా ఎగురుతాను'

'నీ రంగుల గాలిపటం జీవితం నా కిష్టంలేదు'

'నాకు నువ్వు కావాలి'

'నువ్వు నాకు అక్కర్లేదు'

'మరి నీ భర్త నీకు యిష్టమేనా'

'కాదు-కానీ నువ్వుకూడా అంతే'

రత్నం నవ్వింది- సత్యం కోపంగా పెదిమ విరిచాడు.

రత్నం కాఫీ యిచ్చింది- సత్యం త్రాగాడు కోరికల కళ్ళతో ఆమెను మర్దిస్తూ.

ఊహాతరంగాల ఆదృశ్యాన్ని చెరిచింది-

'రత్నం- ఈ హారం నీ కోసం తెచ్చాను'

'ఎందుకు?'

'ఎందు కేమిటి? నీ బోసిమెడ అందంగా లేదని'

'నాకు నగలకు తక్కువలేదు?'

'ఏవీ!'

రత్నం ఒక ట్రంక్కుపెట్టె తెరిచింది- వడ్డాణం, కాసుల పేర్లు, రవ్వల ఉంగరాలు, బంగారు గొలుసులు తళతళ్కు మన్నాయి. సత్యం చేతిలోని హారం వెలవెల పోయింది.

'భూతలింగం ఏంపనిచేస్తారు?'

'వ్యాపారం'

రత్నం నవ్వింది. ఆ నవ్వులముందే సత్యం హారం వెలవెలపోయింది. ఆ హారం జేబులో ముద్చుకున్నాడు. రత్నం అందించింది- ముత్యాల రేకుతో తళతళలాడే తీపి మిఠాయిల పళ్ళెం. మౌనంగా తిన్నాడు సత్యం...

రత్నం ఏడుపు సత్యం ఆలోచనలు త్రెంపింది.

'రేపు దహనక్రియలకు ఏర్పాటు?'

'అది నువ్వే చేయాలి'

'అవును'

సత్యం లోలోపల గొణుక్కున్నాడు.

భూతలింగం ముఖం చూశాడు కప్పినగుడ్డ తొలగించి. నల్లటి పారముఖంతో తేలిన గుడ్లతో రామాయణంలోని రాక్షసునిలా కనిపించాడు. తక్షణం ముఖం గుడ్డతో

మూసేశాడు. ఆ చనిపోయిన క్రూరవ్యక్తి పాపాలముద్దలా పడి ఉన్నాడు. సత్యం చలించాడు.

భూతలింగం స్వార్థంతో జీవితాన్ని పెంచాడు, పాపాలతో. సత్యం స్వార్థం లేకుండా పాపాలతో జీవితం గడుపుతున్నాడు.

మరణం విచిత్రం–సత్యం కంపించాడు. ఏవో అవ్యక్తమైన బాధతో అలమటించాడు.

రత్నం ఏడ్పు మానింది. అద్దంముందుకు నడిచింది. చెరిగిన తిలకం దిద్దుకుంది. పాపిడి సవరించుకుంది. మల్లెపూలు తురుముకుంది– చీర మార్చింది– నవయౌవనమంతా తొణికిస లాడించుకుంటూ సత్యంవైపు వచ్చింది.

మధ్యలోఉన్న భూతలింగం మంచంవద్దకు అనుకున్నాడు సత్యం.

గడియారం పన్నెండు కొట్టింది.

క్రొత్తదినం ప్రారంభ మౌతుంది.

రత్నం భూతలింగం మంచందాటి సత్యం సోఫావైపు వచ్చింది నవ్వుతూ– ఆనందంగా.

సత్యం ఆశ్చర్యపోయాడు.

అటువంటి ఆమె కళ్ళు తళతళలు జీవితంలో చూడలేదు. మత్తు కలిగింది...మరుక్షణంలో శవంముందు సత్తువపోయింది.

రత్నం మరీ సోయగంగా సొగసుగా నవ్వింది.

మేడ ఎదురుగాఉన్న రావిచెట్టుపైని పక్షులు ఏవో కూజితాలు చేశాయి. ఒక్కసారి నిద్రలో కలవరింతల్లా.

భద్రయ్య దూరానఉన్న సినిమానుంచి వేరుసెనగలు తెస్తానని వెళ్ళాడు.

రామి ఒక్కర్తె రావిచెట్టు మొదట్లో కూర్చుంది. తన చిరిగిన సిల్కుచీరతో ఒళ్ళు తుడుచుకుంటూ—

పార్కులోఉన్న సాధువు లేచి కూర్చున్నాడు.

పరిసరమంతా ఏదో శబ్దాలుతప్ప అంతా నిర్మాను ష్యంగా ఉంది.

ఒక కుక్కజంట పార్కులో చెలగాటా లాడుకుంటుంది.

గెడ్డం సాధువు రావిచెట్టువైపు నడిచాడు.

రామి బిత్తరపోయింది. భయపడింది.

రిక్షావైపు పరిగెత్తింది.

ఏయ్ రిక్షా అబ్బీ! లేపింది.

సాధువు గెడ్డం సవిరించుకుంటూ యథాస్థానంలోకి పోయి పడుకున్నాడు. యథాప్రకారం నక్షత్రాలు లెక్క పెడుతూ— తాను చనిపోయాక ఆ నక్షత్రాల గుంపుల్లోకి చేరగల్గేనా అని మీాన వేషాలు లెక్కపెట్టుకుంటూ—

రిక్షావాడు లేచాడు.

సాధువు జారిపోవడం చూచిన రామి ఒయ్యారంగా పోయి రావిచెట్టుక్రింద కూర్చుంది మళ్ళీ.

తన్ను లేపిన రామి మాటాడకుండా రావిచెట్టువైపు ఒంటరిగాపోయి కూర్చోడం ఏదో ఆహ్వాన మిచ్చినట్లు భావించాడు రిక్షావాడు.

కళ్ళు నిలుపుకుని పెద్దవిచేసి ఒళ్ళు దులుపుకుని ఓరగా చూస్తూ నడిచాడు రిక్షావాడు రావిచెట్టువైపు.

'పిలచావేం పిల్లా' నీల్గాడు సిరదాగా.

'భయమేసి'

'ఎందుకు'

'సాధువు నామీద ధ్యాన్నం వేశాడు'

నవ్వాడు రిక్షావాడు—

'ప్రమాదం తప్పిందిగా'

'అవును'

'మరి నేను'

రామి నవ్వింది— కిలకిల—కిలకిల.

రిక్షావాడు ధైర్యం తెచ్చుకొని రామి చెయ్యి పట్టుకున్నాడు.

'ఏయ్...' కూకవేసింది రామి.

'ఎందుకు?'

'నాకు నీతి ఉంది'

'ఉందికాబట్టే వచ్చాను నేను' నవ్వాడు పకపకా రిక్షావాడు.

'ఈవేళకాదు' నవ్వింది సిగ్గుతో రామి.

'ఏం?'

'భద్రయ్య డబ్బిచ్చాడు ఈ రాత్రికి!'

'ఇప్పుడు లేడుగా'

'మళ్ళీ వస్తాడు'

ఏమనాలో అర్థంకాక రిక్షావాడు మౌనంగా నిల్చుని తలగోక్కున్నాడు.

'రేపు' మృదువుగా నవ్వి రిక్షావాణ్ణి గిల్లింది రామి.

'ఎక్కడ'

'ఇక్కడే'

ఒక కుక్క రిక్షాఎక్కి కూర్చుంది. పోనీయ్ అన్నట్లు-

రిక్షావాడు మళ్ళాడు వెనక్కి రామివైపు చూస్తూ-నవ్వుతూ-కుక్కకు జేబులోని జంతిక పెట్టి క్రిందకు పొమ్మన్నాడు.

సినీమా టైమయింది అనుకుంటూ నడిచాడు రిక్షావాడు మువ్వలు ధ్వనిచేసుకుంటూ.

దారిలో భద్రయ్య వేరుసెనగలు ఒలుస్తూ నములుతూ రావిచెట్టువైపు పోడం గమనించాడు రిక్షావాడు. 'అదృష్ట వంతుడు' అని నవ్వుకున్నాడు రిక్షావాడు, అతన్నిచూసి.

ఒంటరిగా కూర్చున్న రామి రావిచెట్టుపైకి చూసింది సాలోచనగా.

ఎదురుగా కిటికీల తెరమీద స్త్రీ పురుషుల జంటల నీడలు వొత్తుకున్నట్లు కనిపించాయి. దీపావళి సొగసు, చీకటి చైతన్యం- అనుకుంటూ ఒళ్ళంతా విరుచుకుంది.

ఆ తెరమీద నీడలు ఏదో మాట్లాడుతున్నట్లనిపించింది రామికి.

'అవును ఈ రాత్రి ఒక్కటే నాకు స్వేచ్ఛఉంది- నీ కోరిక కావాలంటే...' రత్నం కళ్ళు మెరిశాయి మిలమిలా.

'ఈ పరిస్థితుల్లో- శవం ఎదురుగా- నా కళ్ళు నమ్మటం లేదు. భయంతో చెమటలు తుడుచుకున్నాడు సత్యం.

'నమ్మవు- కళ్ళకు ఎప్పుడూ పొరలు ఉంటాయి. అవి నమ్మనీయవు- ఆయన బ్రతికి ఉండగా నేను ఆయన భార్యను- నాకు నీతి ఉంది- నేను ఆయనకు కట్టుబడిఉన్నా- నీమీద అభిమానమున్నా నా భార్యాత్వం కళంకం చేసుకోదల్చుకో లేదు.

'రేపు దహనక్రియలు జరిగాక...'

'జరిగాక- నేను ఆయన విధవను- నాకు పిల్లలున్నారు. నీతి నియమాలు నాకు కావాలి. నా పిల్లలు హాయిగా బ్రతకాలి. కుళ్ళుసంఘం అపవాదులు నేను భరించలేను. అప్పుడు నేను నీవైపు కన్నెత్తి చూడలేను.

ఇది చిత్రంగా ఉంది.

'అవును- చిత్రమే- పరస్త్రీని వాంఛించడం చిత్రమే. నీ కళ్ళకు బానిసనైనాను నేను యీ క్షణాలు- యీ రాత్రి క్షణాలు మాత్రం యివ్వగలను. కట్టుకున్నభర్త శాశ్వితంగా నిద్రపోతున్నారు. కన్నపిల్లలు అర్థంకాని గాఢనిద్రలో ఉన్నారు. ఈ నిశిరాత్రి మన జీవితాలపై మసి నీడలు పూసింది. భర్తలేని నాకు యీ క్షణంలో సమాజం కూడా దూరమే. ఈ సమయం తప్పితే నేను నీకు దక్కను యింక- యీ జీవితంలో !'

సత్యం వింటున్న మాటలు నమ్మలేకపోతున్నాడు.

రత్నం మాట్లాడుతోంది ! యిలాగ !!

ఆమె మనస్సులో ఏముంది ?

సత్యందృష్టి భూతలింగం శవంమీద వాలింది.

గదిలోని చిన్న విద్యుద్దీపం సృష్టిస్తున్న తన నీడ గోడమీద తిరుగుతోంది దెయ్యంలా.

రత్నం దిగాలుగాపోయి మంచంమీద కూర్చుంది. వెక్కి వెక్కి ఏడ్చింది.

కళ్ళు తుడుచుకుని కమనీయంగా నవ్వింది.

ఆమె మానసిక ప్రవర్తన అర్థంకాని వ్యూహంలా ఉంది సత్యానికి.

విద్యుద్దీపం పెద్దది- ఆర్పేసింది రత్నం.

చిన్నబల్బు వెలుగుతోంది గ్రుడ్డిగా గదిలో-

రత్నం పడుకున్న పందిరిమంచం ఆ గదిలోని చీకటిలో మసకగా ఆనుతోంది.

సత్యం నీడ కదిలింది గోడమీద.

తొట్రుపడ్డాడు సత్యం.

వీధిలో విద్యుద్దీపాల కాంతులతో ఏర్పడిన రావిచెట్టు కొమ్మల నీడలు కిటికీలోంచి దూసుకుని సత్యం నీడకు వికృతాకారం యిచ్చాయి.

భూతలింగం నిలుచున్నట్లు భ్రమపడ్డాడు ఒక క్షణం. కళ్ళు నులుముకుని చూశాడు దిగ్భ్రాంతితో.

భూతలింగం మంచంమీద నిశ్చలంగా పడిఉన్నాడు.

రత్నం తన దగ్గరకు వచ్చింది. మందస్మితంతో.

'ఒంటిగంట కొడుతోంది'

గడియారంవైపు చూశాడు సత్యం.

'మరో అయిదు గంటల్లో సూర్యోదయ మౌతుంది'

కిటికీలోంచి బయటికి చూశాడు సత్యం.

పార్కు విద్యుద్దీపాల వెల్గుల్లో ఆకుపచ్చగా మెరుస్తోంది కృత్రిమంగా.

రత్నం లేపింది సత్యాన్ని చెయ్యిపట్టుకుని.

ఆమె చేతులోని మంచుగడ్డ శీతలము సత్యాన్ని తికమక పెట్టింది.

పేలవంగా నవ్వింది రత్నం. లేవని సత్యాన్నిచూసి.

'ఒక క్షణం కనుమూస్తా- ఈ సర్వస్వం నీ ఆధీనంలో వదిలేసి-' నవ్వింది రత్నం.

సత్యం గుడ్లు అప్పగించి గాభరాగా ఆమెవైపు చూశాడు.

రత్నంపోయి మంచంమీద ఒరిగింది.

ఆ నిశ్చింతగా నిద్రలో మునిగింది.

గదినిండా నిశ్శబ్దం తాండవించింది.

గడియారం టిక్కుటిక్కు శబ్దాలు అతని గుండెలమీద

సమ్మెట పోటుల్లా ఉన్నాయి. కిటికీనుంచి బయటికి చూశాడు సత్యం. పార్కుప్రక్కరోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

బస్సు ఒకటి జనంలేకుండా బర్రుమని పరిగెత్తింది. ఆస్పత్రిప్రక్క గోడనీడలో బిచ్చగాడు నిశ్చింతగా నిద్రిస్తున్నాడు. నాలిక చాచుకొని ఒగరుస్తూన్న కుక్క బిచ్చగాడి రక్షక భటుడిలా ప్రక్కనే కూర్చుంది. గస్తీకాసే పోలీసువాళ్ళు కర్రలు చేతపట్టి కాకీదుస్తుల్లో తిరుగుతున్నారు. సినీమా రెండవఆట పూర్తికాగా వేరుసెనగ, అరటిపళ్లు, కారాలు

అమ్మే అంగడిబళ్ళు కదిలిపోతున్నాయి. యింటిగమ్యం దారివైపు. ఆకలి నీరసం నిద్రలో సాధువు సర్వం పరిత్యజించి పార్కులోని పచ్చగడ్డి మైదానంలో దిగంబరిలా నిద్రపోతున్నాడు.

రావిఆకులు క్రింద రాలుతున్నాయి. అప్పటికే ఎగిరి వచ్చిన బాణసంచాతుక్కు ఎండు రావిఆకులతో స్నేహం కలిపి, చెలగాటా లాడుతున్నాయి. చిరుగాలి ఎగురుల్లో అటువంటి ఆకులు తన బూట్లక్రింద ఎన్నో నలిగిపోయాయి. రత్నంకోసం తాను వచ్చిన ఎన్నో దినాల్లో ఎదురుగా ఆడవాళ్ళ కాలేజీ- రంగురంగుల నవయావనులను భ్రమింప జేసిన తన ప్రయత్నాలు- బస్సుల్లో సావాసం పెంచి, ఉస్సురనే నిట్టూర్పులతో వారిని విడిచినగతి- స్త్రీలతో పరిచయం- వారిని పరిత్యజించడం ఒక చెలగాటంలాంటి అలవాటు. వెలక్కాయలు ఆకాశంలోకి ఎగిరి ప్రేలాయి పెద్దగా. జెట్ బాంబులు పడిన శబ్దం చేస్తున్నాయి.

సత్యం గుండెనిండా భూకంపాలు లేచాయి. గత చరిత్ర తల్చుకుంటూంటే...

ఆనాడు దీపావళి- రాత్రి సమయం-ప్రక్కయింటి రాధ చనిపోయింది. యింటివా రంతా బయట బాణసంచా కాల్చుతూంటే, యింట్లో చీరకు నిప్పంటించుకుని శబ్దమైనా లేకుండా బాధైనా వ్యక్తం చెయ్యకుండా కసిగా మరణించింది రాధ... హాహాకారం చెలరేగింది-ప్రక్కయింట్లో గుసగుసలు-ఏడ్పులు- కేకలు- అరుపులు- తండ్రి శివనాథం చెవిలో పడింది రహస్యం.

ఆయన తారాజువ్వ కాలుస్తున్న సత్యం దగ్గరికి వచ్చాడు. తారాజువ్వలా లేచి భళ్ళున దవడమీద కొట్టాడు యింట్లోంచి పొమ్మన్నాడు- ఆఖరిసారిగా.

ప్రక్కయింటి వితంతువు రాధను యింట్ల ఎవరూ లేని సమయంలో ఒకరోజు సినీమాకు వారుపోయిన కాలంలో పరిచయం పురస్కరించుకుని బలవంతంగా కామవాంఛ తీర్చుకున్నాడు సత్యం. గర్భం దాల్చుతున్న రాధ యింక భరించలేక సమాజం నిందలు పెనుభూతాల్లా ఎదురుగా నృత్యం చెయ్యగా-శరీరాన్ని దీపావళినాడు దీపావళికి ఆహుతి చేసింది- భస్మమైంది.

ఇల్లు విడిచి పది సంవత్సరాలైంది. ఇంటిదగ్గర ఎవరు ఎలా ఉన్నారో తెలియదు. అదొక దీపావళి.

ఈనాడు- రత్నం శరీరం ముట్టడానికికూడా ఏదో సందేహం- బాధ కల్గుతున్నాయి. వయస్సు పెరుగుతోంది. ఉద్రేకాలు తగ్గుతున్నాయి. మనస్సు ఏదో చింతనలో పడుతోంది. ఆ ఆత్మపరిశోధనకు ఏదో ఉదయం కల్గినట్లయింది. రత్నం ఆహ్వానంతో.

ఉద్రేకాల శరీరం ఒక శవంలా తయారౌతుంది. బ్రతికున్న తానూ భూతలింగంలా ఎప్పుడో కలిసిపోతాడు భస్మంలో. రత్నం తన్ను వెక్కరించిందనిపించింది. అవమాన పరిచింది. హాస్యాస్పదుణ్ణి చేసింది. అన్నిటికీమించి తనలో ఏదో నూత్నచైతన్యం కల్గచేసింది. గులాబీ, నీలం, ఆకుపచ్చ, తెలుపు, పసుపు, ఊదారంగు, బూడిదవర్ణం- రంగుల చీరలు

ఎన్నో తన చేతుల్లో నలిగిపోయాయి. ఎన్నో కృత్రిమ అపహాసాలు, మందస్మితాలు తననుంచి వెలువడ్డాయి! ఈ బ్రతుకంతా ఏమిటి? ఎందుకు ఈ బ్రతుకు యిలా నడుస్తోంది? ఇల్లు విడిచి వచ్చాక పాన్ దుకాణం, సారా దుకాణాల్లో వాటా- తర్వాత ఇనుప వ్యాపారం, తర్వాత కంట్రాక్టరు ఉద్యోగం- డబ్బు గడించడంలో తనకు మించిన నేర్పరి లేడు. కాని యింతవరకు రత్నం యిచ్చిన విజ్ఞానం గడించినట్లు లేదు. రత్నం పడుకున్న గదిలో విద్యుద్దీపం వెలిగించాడు సత్యం.

ఆమె కన్నీటి చారలు మెరుస్తున్నాయి నున్నని బుగ్గలపైని...

చిన్నప్పుడు యిద్దరూ శివాలయంలో ఒకరోజు కొలనువద్ద—

'ఏం చేస్తున్నావు?'

'ఈ పొగడపూలు- ఒక్కటొక్కటి- కొలనులో వదిలేస్తున్నా!'

'ఎందుకు'

పడవల్లా నడుస్తాయి- నీటిలో నడుస్తాయి- తర్వాత కుళ్ళుతాయి- నీటి అగాధంలోని బురదలో చివరకు వాలి కలిసి అదృశ్యమౌతాయి అంతేకదూ- బాగుంటుంది గదూ'

'అట్లు పారేసేబదులు నాకివ్వరాదూ దండగుచ్చుకుని తల్లో పెట్టుకుంటా—'

'నీకు పూలు అలంకారానికి, పూజకు కావాలి'

'నీకు పూలు ఆటకు, వేటకు కావాలి రత్నం ఎదురు సమాధానం. నవ్వాడు సత్యం.

కొలనులో తేలుతున్న పూలు చూసింది జాలిగా రత్నం......

రత్నంకోసం తెచ్చిన కనకాంబరం పూల మరువందండ అమె ముఖంపై పెట్టాడు పూజిస్తున్నట్లు.

'రత్నం' సత్యం వేడికన్నీరు స్రవించింది.

'నువ్వు నిజంగా రత్నానివి!' అతని వేడి కన్నీటిభాష్యం ఆమె వదనంపై వాలి తామరాకుపై నీటిబొట్టులా తేలింది.

ఆమె లేస్తుందేమోనని భయపడ్డాడు సత్యం—

ప్రక్కకు నడిచాడు—

విద్యుద్దీపం అర్పేశాడు—

ఆ గదిలో నిశ్శబ్దానికి చైతన్యం పెరిగింది.

వీధిలో శబ్దాలు సర్దుకుంటున్నాయి తక్కువస్థాయిలో—

రావిచెట్టుక్రింద కూర్చున్న రామి, భద్రయ్య అదృశ్యమయ్యారు.

ఏదో టాక్సి వచ్చింది— ఆస్పత్రి ప్రక్కనే నిద్రపోతున్న డాక్టరుగారిని లేపడానికి—

ఆ నిశ్శబ్దంలో టాక్సిలోంచి దిగినవారి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి—

'కర్మ— ఏం చేస్తాం— వద్దురాఅంటే వింటేగా— జెట్లు పిలుస్తాడట— పెద్దవాళ్ళ మాటలు వినడం లేదు— ఇప్పుడేమౌతుందో...'

మూల్గు....రోదన....ధ్వనులు....అలల్లా....గాలిలో తేలాయి—

డాక్టరు తలుపు తెర్చాడు.

లైట్లు వెలిగాయి ఆస్పత్రిగదిలో–

కిటికీ తెరలమీద డాక్టరు రోగిచేతికి కట్టుకడ్తున్నట్లు నీడలు స్పష్టంగా కనిపించాయి.

మరి కొద్దిసేపటిలో టాక్సీ నడిచిపోయింది–

'దీపావళి అతని చేతులు కాల్చింది– దీపావళి నా గుండెలు కాల్చింది' సత్యం గొణుకున్నాడు.

నిశిరాత్రి కృత్రిమ వెలుగులు– దీపావళి బాణసంచా వెలుగులు–

నిశిరాత్రిలోని నస్థిమైన వెలుగులు శశితారలు యిచ్చే వెలుగులు– చుట్టుముట్టాయి– సత్యాన్ని.

ఆకాశంలో తారలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

సత్యాన్నిచూచి నవ్వులు వెదజల్లుకుంటున్నట్లున్నాయి.

తార–చంద్రుడు–బృహస్పతి–

తార సత్యం చెప్పింది–

చంద్రుడు కావాలంది–

సమాజాన్ని ధిక్కరించింది–

చంద్రుణ్ణి పరిణయ మాడింది–

తన విప్లవమార్గ మే నీతి అంది–

ఆ నీతి నేడు న్యాయమైంది–

ప్రతీ ప్రవర్తనలోని ఒక విప్లవసూత్రం నీతి న్యాయ మౌతుంది.

రత్నం తన ప్రవర్తనపై విప్లవం చూపింది–

తనకు నీతి బోధించింది-

అది న్యాయమని తోచింది- సత్యానికి.

'రత్నం' దుఃఖంపొంగి సత్యం ఆమె దగ్గరికి వెళ్ళాడు.

చేతులతో ముఖం తాకపోయాడు-

కంపనతో కదిలి వెనక్కి వచ్చేశాడు.

ఆ నిశిరాత్రి ఆకాశంలో చుక్కలు చూస్తూ మౌనంగా కూర్చుండిపోయాడు సత్యం-

తెలతెల వారుతోంది-

సాధువుకు నిద్రభంగం కలిగింది-

రావిచెట్టుపైని పక్షులు దినచర్యకోసం రమణీయమైన కూజితాలలో ఉదయశీతల వాయువుల్లో ఎగురుతున్నాయి.

బస్సులు రోదచేస్తు ప్రయాణం చేస్తున్నాయి.

కాలేజీ కంపౌండులోనుంచి వీధిలోకి ఒంగి చూస్తున్న సీమ తంగేడు చెట్టు సూర్యోదయానికి పోటీగా తన పువ్వులలో అరుణరాగం యిముడ్చుకుని నవ్వుతోంది-

రత్నం లేచింది-ఆమె వదనంలో కుంకం చెరిగిపోయింది-

సత్యం వెనకవచ్చి నిల్చుంది-

సత్యం గమనించలేదు-

'నిద్రపోలేదా రాత్రి' అడిగింది రత్నం పేలవంగా.

సత్యం లేచి నిల్చున్నాడు.

'నన్ను క్షమించు రత్నం'

అతని వేడికన్నీరు ఆమె పాదాలమీద రాలింది-

మౌనంగా రత్నం వెనకకు తిరిగి నడిచింది భూతలింగం శవం ఎదుటికి-

సత్యం ఆమెను అనుసరించాడు-

'దహనక్రియలకు ఏర్పాటు చేస్తాను'

రత్నం ఒక క్షణం సత్యంవైపు చూసింది తలదించుకుని మౌనంగాపోయి నిదురపోతున్న పిల్లల దగ్గరగాచేరి, బాధగా కూర్చింది నిట్టూర్చి.

సత్యం గదితలుపులు తెరుచుకుని వీధిలోకి నడిచాడు.

రావిఆకుల గుంపులు వీధి తుడిచే మనిషి గంపలో నింపుకుంది.

సత్యం బూట్ల అడుగున ఎండుఆకులు నలుగుతున్న విరుగుతున్న శబ్దాలు లేవు.

బిచ్చగాడు లేచాడు- బిచాణా సర్దుకున్నాడు-

కుక్క నిలుచుని ఒళ్ళు దులుపుకుంది.

పార్కులోని సాధువు నీళ్ళతో ఒళ్ళు తుడుచుకుని విభూతి రాసుకొని కదిలాడు నగరములోకి-

సూర్యుని దీపం తన నిశిరాత్రి నీడలో ఏం జరిగిందని పరామర్శ చేస్తోంది.